క్లుప్తంగా

వైభవంగా రాముడి బ్రహ్మోత్సవాలు



చిలుక వాహనంపై కోటేశ్వరస్వామి

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో కొలువైన సీతా,లక్ష్మణ సమేత ఆత్మరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామి, అమ్మవార్లు వ్యాలీ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామి అమ్మవార్లను పరిమళ పుష్పాలతో అలంకరించి వ్యాలీ వాహనంపై కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఉభయకర్తలుగా మల్లయ్య కుటుంబ సభ్యులు, హజరత్తయ్య, శేషయ్య, వెంకయ్య, వెంకటేశ్వర్లు, హజరత్తయ్య, పెంచలయ్య వ్యవహరించారు.

కూలీలు వంద రోజుల పనిచేయాలి



మాట్లాడుతున్న ఏపీడీ గాయత్రి

ఉదయగిరి: ఉపాధి కూలీలు వంద రోజుల పని దినాలు పూర్తి చేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని డ్వామా ఏపీడీ గాయత్రి అన్నారు. ఆమె శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయగిరి, సీతారామపురం మండలాల ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమృత్ సరోవర్ పథకం కింద పలు గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఆయా గ్రామాల్లో నీటి నిల్వలు వృద్ధి చేసేందుకు పనులు ఎంపిక చేశారన్నారు. ఆయా గ్రామాలను పరిశీలన బృందం ఈ నెల 4 నుంచి తనిఖీ చేస్తుందన్నారు. పనులకు సంబంధించిన రికార్డులు, పనిబోర్డులు సిద్ధంగా ఉంచాలన్నారు. కూలీలకు కొలతల ప్రకారం పనులు కేటాయించాలన్నారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి పనికి రికార్డు ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోపి

సంగం: ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం ప్రతి ఒక్కరికీ అందాలని ఎంపీడీఓ గోపి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలతో సంక్షేమ పథకాల అమలు, పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఆయుష్మాన్ భారత్, ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించే కార్యక్రమాన్ని 10వ తేదీ లోపు పూర్తి చేయాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్‌జ్యోతి, బీమా యోజన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని తెలిపారు.

వీధికుక్క దాడిలో చిన్నారికి గాయాలు



గాయపడిన బాలుడు

సంగం: సంగంలోని మసీదుసెంటర్‌లో ఎనిమిదేళ్ల బాలుడిపై వీధికుక్క దాడి చేసి గాయపరిచింది. ఈ ఘటన శుక్రవారం జరిగింది. వీధిలో బాలుడు ఆడుకుంటూ ఉండగా కుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేయడంతో ఆ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. తల్లిదండ్రులు స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

స్పందనను సద్వినియోగం చేసుకోవాలి

కలిగిరి: ప్రతి సోమవారం నిర్వహించే ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీరామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. ప్రత్యేక స్పందనలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

వేటకు రెడీ



వలలను సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

- వలలు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

కావలి: సముద్రంలో చేపల వేటకు మత్స్యకారులు సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు మొత్తం 61 రోజుల మత్స్య సంపద పునరుత్పత్తి కాలంలో నేపథ్యంలో వేట నిషేధం అమలవుతోంది. మరో 10 రోజుల్లో నిషేధ కాలం ముగియనుండడంతో కావలి నియోజకవర్గంలోని తీరంలోని మత్స్యకారులు వలలను సిద్ధం చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని కావలి రూరల్, బోగోలు, అల్లూరు మండలాల్లోని సముద్ర తీరం వెంబడి ఉన్న 35 గ్రామాల్లో 55 కి.మీ. సముద్ర తీరం విస్తరించి ఉంది. తీరం వెంబడి నివసిస్తున్న మత్స్యకారుల్లో 14,500 మంది చేపల వేట చేయడమే వృత్తి. అయితే నిషేధిత కాలంలో వేట లేక పూట గడవని మత్స్యకారులను గుర్తించి ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా అమలు చేస్తోంది.

4,912 మందికి లబ్ధి

కావలి నియోజకవర్గంలో 4,912 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున గత నెల 16 తేదీ వారి బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. కేవలం చేపలు వేట లేకపోవడం వల్ల మత్స్యకారుల కుటుంబాల అవసరాల నిమిత్తం ప్రభుత్వం అర్హులైన 4,912 మందికి రూ. 4 కోట్ల 91 లక్షల 20 వేలు నగదును అందజేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్హులైన మత్స్యకారులకు రూ.4,000 ఇస్తామని చెప్పి, నియోజకవర్గంలో కేవలం 1,500 మందికి మాత్రమే ఇస్తుండేవారు. మిగిలిన వారికి మొండి చేయి చూపేవారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయాలల్లో ఫిషరీస్ అసిస్టెంట్ అనే ఉద్యోగిని నియమించడం ద్వారా, మత్స్యకారులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుంచి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదవుతోంది. దీంతో మరింత మంది మత్స్యకారులకు ఎటువంటి సిఫారసులు లేకుండానే. అర్హతలనే ప్రమాణికంగా నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు వలంటీర్లు సేకరించడంతో మరింత మందికి వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద రూ.10,000 చొప్పున ఆర్థిక సహాయం అందింది. ఇప్పుడు పరిస్థితులు మెరుగుపడడంతో మత్స్యకారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

సర్వసన్నద్ధం

వేట నిషేధ కాలం ముగియడంతో వేటకు సిద్ధమయ్యేందుకు అవసరమైన బోట్లు, మోటార్లు, వలలు మరమ్మతులు చేసుకుంటున్నారు. మత్స్యకారులు తమ నివాసాల వద్ద వలలను మరమ్మతులు చేసుకునే పనిలో తలమునకలై ఉన్నారు. బోట్లకు అవసరమైన మరమ్మతులు చేసుకోవడానికి అందుకు సంబంధించిన ఫైబర్ పనులు చేసే కార్మికులను తీరానికి పిలిపించుకుంటున్నారు. బోట్లకు ఉండే ఇంజిన్ల పనితీరును పరీక్షించుకుంటున్నారు. వలలు, బోట్లు, ఇంజన్లు మరో 10 రోజుల్లో సముద్రంలో వేటకు చేసుకోవడానికి సిద్ధం చేసుకొనే పనిలో మత్స్యకారులు తలమునకలై ఉన్నారు.

ఆదుకుంటున్న ప్రభుత్వం



చేపల వేట నిషేధం కాలంలో ప్రభుత్వ ఆర్థిక సహాయం సీఎం జగన్ ప్రభుత్వంలో అర్హులైన అందరికీ రూ.10,000 చొప్పున నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతుంది. టీడీపీ ప్రభుత్వంలో కేవలం రూ.4,000 ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పే వారే కానీ, ఇచ్చే వారు కాదు. మత్స్యశాఖ అధికారుల చుట్టూ తిరిగినా కనికరించే వారు కాదు. ఆర్థిక సహాయం ఎందుకు అందదో కూడా అధికారులు చెప్పలేకపోయేవారు. కానీ ఇప్పుడు జగన్ ప్రభుత్వంలో అధికారులే మత్స్యకారుల ఇంటికి వచ్చి అన్ని వివరాలు అడిగి రాసుకుని అవసరమైనవి జిరాక్స్‌లు తీసుకెళ్తున్నారు. రూ.10,000 నగదు కూడా అందరికీ అకౌంట్‌లో పడిపోతున్నాయి. చేపల వేటకు అవసరమైన పనులు చక్కబెట్టుకుంటున్నాం.

– కొమారి రాజు, మత్స్యకారుడు, తుమ్మలపెంట, కావలి రూరల్ మండలం

గ్రంథాలయాలు విజ్ఞానభాండాగారాలు



ఆత్మకూరు లైబ్రరిలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: అన్ని రకాల పుస్తకాలు ప్రత్యేకంగా విజ్ఞానదాయకమైన పుస్తకాలు లభ్యమయ్యే గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ ఓంకారం రాజు అన్నారు. గత నెల రోజులుగా ఆత్మకూరు పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, పాటలు పాడడం, కథలు రాయడం, చెప్పడం, తదితర వాటిలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ రాజు మాట్లాడుతూ ఏటా వేసవిలో విద్యార్థులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వర్లు, లైబ్రేరియన్ అసిస్టెంట్ ఎల్.తనూజ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులు



వృద్ధులకు సరుకులు పంపిణీ

కావలి: డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని 60 మంది నిరుపేద వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ రవికాంత్ మాట్లాడుతూ నిరుపేదలైన వృద్ధులను ప్రతి ఒక్కరూ తమకు వీలైనంత వరకు ఆదుకోవాలని పిలుపునిచ్చారు. డీఆర్ వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు. ఆయన కుమారులు వినయ్ కుమార్‌రెడ్డి, విద్యాధర్‌కుమార్ రెడ్డి కూడా తండ్రి బాటలో నడుస్తున్నారన్నారు. కావలి ఏరియా హాస్పిటల్ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ హరిత, విశ్వోదయ రెక్టార్ వినయకుమార్‌రెడ్డి, సేవాసమితి చైర్‌పర్సన్ దొడ్ల లక్ష్మి, డైరెక్టర్ తాతిరెడ్డి, జవహర్ భారతి రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వర్లు, సభ్యులు టి.రామకృష్ణ, ఎం.నవీన్, ఎం.లక్ష్మీప్రసన్న, సతీష్‌సింగ్ పాల్గొన్నారు. అనంతరం జవహర్ భారతి రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వర్లు వృద్ధులకు దుప్పట్లు, భోజనాలు పంపిణీ చేశారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం

- ట్రైనీ సహాయ కలెక్టర్ విద్యాధరి



మాట్లాడుతున్న ట్రైనీ సహాయ కలెక్టర్ విద్యాధరి

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న భూ రీసర్వే ప్రక్రియతో రైతుల భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని జిల్లా అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ విద్యాధరి అన్నారు. ఆమె శుక్రవారం మండలంలోని కృష్ణంపల్లెలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించి సర్వే తీరుతెన్నులను తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సర్వే బృందానికి రైతులు సహకరించేలా చూడాలన్నారు. రీసర్వేను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. రీసర్వే ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

చిన్నారుల ఎత్తు, బరువులను నమోదు చేయాలి



కొలతలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్

ఉదయగిరి: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల్లోని చిన్నారుల బరువు, ఎత్తులు ప్రతి నెల తీసి రికార్డుల్లో నమోదు చేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. ఆయన శుక్రవారం పట్టణంలోని గొల్లపాళెం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని చిన్నరులకు పౌష్టికాహారం అందించాలన్నారు. టీకాలు సకాలంలో వేయించాలన్నారు. రక్తహీనత ఉన్న చిన్నారులను గుర్తించి వైద్యం అందించాలన్నారు. చిన్నారుల ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు.

తాగునీటి పథకాల పునరుద్ధరణకు చర్యలు

జలదంకి: విద్యుత్ సరఫరాకు విఘాతం కలగడంతో తాగునీటి పథకాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని మండల సచివాలయాల కన్వీనరు తిప్పారెడ్డి ఇందిరమ్మ తెలిపారు. గమళ్లపాళెం, గిరిజన, వడ్డేపాళెం ప్రాంతాల్లోని తాగునీటి బోర్లను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యురాలు కొండమ్మతో కలిసి ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రెండు రోజుల క్రితం వీచిన గాలులకు జలదంకి పంచాయతీలో విద్యుత్ సరఫరా లేక తాగునీరు బోర్లు పనిచేయలేదని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన వాటిని పూర్తిచేసి తాగునీరు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వ్యవసాయశాఖ ఏడీఏ బాధ్యతల స్వీకరణ



కావలిరూరల్: కావలి వ్యవసాయశాఖ ఏడీఏగా సీహెచ్ నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సూళ్లూరుపేటలో పనిచేస్తూ బదిలీపై కావలికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని రైతులకు అందేలా కృషి చేస్తామని, ఎప్పటికప్పుడు రైతులతో మమేకమై పంటలో ఎలాంటి మెలకువలు పాటించాలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కావలిలో పనిచేస్తున్న కన్నయ్య నెల్లూరు భూసార పరీక్ష కేంద్రానికి బదిలీ అయ్యారు.

మున్సిపల్ కమిషనర్ రిలీవ్



శివారెడ్డి

కావలి: కావలి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ మంగళగిరి–తాడేపల్లి మున్సిపాలిటీకి బదిలీ అయిన శివారెడ్డి శుక్రవారం రిలీవ్ అయ్యారు. మూడేళ్లపాటు శివారెడ్డి కావలి కమిషనర్‌గా సేవలందించారు. ప్రధానంగా పట్టణాభివృద్ధితో పాటు పారిశుద్ధ్యం పరిరక్షణలో తనదైన ముద్రవేసుకున్నారు. విధి నిర్వహణలో ప్రజలు తనకు అండగా నిలిచిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డితో పాటు మున్సిపల్ ఉద్యోగులకు, కార్మికులకు, కార్మిక సంఘా ల నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కావలి పట్టణ ప్రజల ఆదరాభిమానాలు ఎన్నటికీ మరిచిపోలేదనని ఈ సందర్భంగా శివారెడ్డి గుర్తు చేసుకున్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై విశ్వనాథరెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు వద్ద 67వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం స్థానిక ఎస్సై విశ్వనాథరెడ్డి వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులతో మాట్లాడుతూ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి వాహనానికి సంబంధించి పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అపరిమిత లోడ్‌తో రవాణా చేయడం, అతి వేగంగా వాహనాలు నడపడం, లైసెన్స్ లేని వారు డ్రైవింగ్ చేస్తున్న వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏఓ బాధ్యతల స్వీకరణ




బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఓ శివనాగప్రసాద్

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు వ్యవసాయాధికారిగా కె.శివనాగప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా కారంచేడు నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఏఓ శ్రీహరినారాయణ నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఏఓ నాగశివప్రసాద్ ఏడీఏ రామిరెడ్డిని కలిసి జాయినింగ్ రిపోర్టు అందించారు.

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఆత్మకూరు: గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంతో పాటు సెంట్‌మేరీస్ ఉన్నత పాఠశాలతో పాటు మరో కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ షేక్ నజీర్ తెలిపారు. తొలి రోజు తెలుగు పరీక్షకు సెంట్‌మేరీస్ పాఠశాలలో 75 మందికి 24 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 38 మందికి ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పాఠశాల హెచ్‌ఎం పుల్లయ్యతో తెలిపారు.

ఎస్సైగా కోటిరెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై కోటిరెడ్డి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు నూతన ఎస్సైగా ఎన్.కోటిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు రూరల్ నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదన్నారు.

నేడు ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

ఆత్మకూరురూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం 15 విడత సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) బహిరంగ సమావేశం శనివారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్వామా పీడీ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

కాపీ పేస్ట్ పథకాలతో టీడీపీ మోసం



దూబగుంటలో లబ్ధిదారుకి అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- పేదల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్ మేనిఫెస్టో రూపకల్పన
- ప్రతి పథకం ప్రజలకు చేర్చిన ఘనత సీఎం జగన్‌ది
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నికల ముందు మేనిఫెస్టో రూపకల్పన చేసి, దాన్ని సంపూర్ణంగా అమలు చేశారన్నారు. తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇవి.. మీకు అందించామని శాసనసభ్యులుగా తామంతా గర్వంగా చెప్పుకుంటున్నామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. అయితే గతంలో ఇచ్చిన ఏ మేనిఫెస్టోను అమలు చేయని చంద్రబాబు వంటి మోసగాడు.. మళ్లీ ఇప్పుడు కాపీ పేస్ట్ పథకాలతో జనాన్ని మోసం చేయడానికి వస్తున్నాడని మండిపడ్డారు. శుక్రవారం ఏఎస్‌పేట మండలం రాజవోలు సచివాలయం పరిధిలోని దూబగుంటలో ఎమ్మెల్యే మేకపాటి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలు వివరిస్తూ సంక్షేమ లబ్ధి కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాను నిర్వహించిన ప్రజాసంకల్ప పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని నిర్దిష్టమైన మేనిఫెస్టో తయారు చేసుకుని, ముఖ్యమంత్రి అయిన అనంతరం ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించేలా సంక్షేమ పథకాలను అందించారన్నారు. ఒక మేనిఫెస్టోను సంపూర్ణంగా అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని ప్రశంసించారు. దేశంలో ఏ ప్రభుత్వం తాను ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేసిన చరిత్ర లేదని గుర్తు చేశారు. ప్రతిపక్ష పార్టీలు నాలుగేళ్లుగా జగనన్న సంక్షేమ పథకాలపై బురద చల్లుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను సైతం విమర్శించారన్నారు. ప్రస్తుతం వారే స్వయంగా మన ముఖ్యమంత్రి పథకాలను పేర్లు మార్చి ప్రజలను ఏమార్చే మేనిఫెస్టో ప్రకటించారని, పరోక్షంగా మన ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను సమర్థిస్తున్నారన్నారు. 2014, అంతకు ముందు ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలకు చూపి ఏ మేరకు అమలు చేశారో వివరించాలన్నారు.

రోడ్ల అభివృద్ధికి త్వరలో ప్రణాళిక

నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ఒక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రకటించారు. ఆత్మకూరు–వింజమూరు రోడ్డు, నందవరం–ఉదయగిరి రోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ అధికారులకు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ఒక రోడ్డు ఎన్‌ఎఫ్‌బి కింద, మరో రోడ్డు పీడబ్ల్యూడీ కింద నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారన్నారు. రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలను వచ్చే మేనిఫెస్టోలో పొందుపరిచి ప్రతి గ్రామంలో వీటి నిర్మాణం పూర్తి స్థాయిలో జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. దూబగుంట సమీపంలో ఓ ఫ్యాక్టరీ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఆ విషయమై కలెక్టర్‌కు తెలిపి చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దారు ఏవీ రమణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, యానాదిరెడ్డి, సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, సూరా శ్రీనివాసులరెడ్డి, రవీంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ జనార్దన్ రెడ్డి, జేసీఎస్ కో–ఆర్డినేటర్ పులిమి రమేష్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సంధాని, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ షౌకాత్ ఆలీ, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు రియాజ్ అహ్మద్, సర్పంచ్ కుడారి హజరత్తమ్మ, పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్ల అక్రమ కొనుగోళ్లపై ఆందోళన



సీపీఎం, కేవీపీఎస్ నాయకులతో తమ గోడు వెళ్లబోసుకుంటున్న గిరిజనులు

ఆత్మకూరు: పట్టణంలోని వెంకట్రావుపల్లి గిరిజనకాలనీలో సుమారు నూరు కుటుంబాలకు పైగా గిరిజనులు నివశిస్తున్నారు. అయితే ఇటీవల ఆత్మకూరుతో పాటు వెంకట్రావుపల్లికి చెందిన పలువురు ఆ గిరిజనుల ఇళ్లను మాయమాటలు చెప్పి కొనుగోలు చేస్తున్నారు. ఆ ఇళ్లను బట్టి నుంచి రూ.30 వేల నుంచి రూ.50 వేలకు కొనుగోలు చేస్తున్నారని, ఆ ఇళ్లను పగులగొట్టి నూతన ఇళ్ల నిర్మాణాలు చేపడున్నారనంటూ కుల వ్యతిరేక పోరాట సమితి, సీపీఎం నాయకులను కలిసి తమ గోడును చెప్పుకుంటున్నారు. ఆ ప్రాంతంలో శుక్రవారం పర్యటించి అక్రమ కొనుగోళ్లపై విషయాలు తెలుసుకుని ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్లకు గిరిజనులతో కలిసి వెళ్లి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

స్పందన అర్జీలను పరిష్కరించాలి



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శీనానాయక్

కలిగిరి: స్పందన అర్జీలు పెండింగ్‌లో ఉండకుండా తక్షణమే పరిష్కరించాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ సూచించారు. శుక్రవారం ఆయన కలిగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందితో స్పందన అర్జీలు పెండింగ్‌పై సమీక్షించారు. పనులపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా రెన్యూవల్ చేయించండి

అల్లూరు: 2023–24 సంవత్సరానికి సంబంధించి వైఎస్సార్ బీమా పథకాన్ని రెన్యూవల్ చేయించే బాధ్యతను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తీసుకోవాలన్నారు. స్థానిక అల్లూరు–1 సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గతంలో నమోదు అయి ఉన్నారో, వారి పేర్లను మరోసారి పరిశీలించి యజమాని, నామినీల పేర్లను సరిచేసి రెన్యూవల్ చేయాలని సూచించారు. కుటుంబ యజమాని ఆకస్మికంగా మరణించినా, సహజ మరణం పొందినా ప్రభుత్వం తరఫున వారి కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష వరకు ఆర్థిక సాయాన్ని అందజేస్తారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



పిల్లల ఎత్తు, బరువును పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

అల్లూరు: అల్లూరు–2 సచివాలయం పరిధిలోని అరుధంతీయవాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ శ్రీదేవి శుక్రవారం పరిశీలించారు. ఐదేళ్లలోపు పిల్లల ఎత్తు బరువు ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని నెల నెలా క్రమం తప్పకుండా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సచివాలయ మహిళా పోలీస్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

డీసీఓ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డిస్ట్రిక్ కో–ఆపరేటివ్ ఆఫీసర్ సుధాభారతి

అల్లూరు: అల్లూరు పడమర ప్రాథమిక సహకార పరపతి సంఘం సొసైటీని డిస్ట్రిక్ కో–ఆపరేటివ్ ఆఫీసర్ సుధాభారతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ రికార్డులను పరిశీలించారు. సొసైటీలో డిపాజిట్లను, గోల్డ్‌లోన్లను పెంచే విధంగా కృషి చేయాలన్నారు. సొసైటీలో క్రాప్‌లోన్, ఇతర లోన్‌ల రికవరీ శాతం బాగుందన్నారు. రికార్డులను పక్కాగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సొసైటీ చైర్‌పర్సన్ బత్తుల భక్తవత్సలరెడ్డి, సొసైటీ సీఈఓ రాధయ్య పాల్గొన్నారు.